# వసుధైక కుటుంబం



సోమవారం ప్రొద్దునే, ఆఫీస్‌లో కంప్యూటర్ టెర్మినల్ ముందర కూర్చుని, మర్నాడు ఎగ్జిక్యూటివ్ మేనేజ్‌మెంటుకి ఇవ్వవలసిన 'ప్రెజంటేషన్' స్లైడ్స్‌ని, పవర్ పాయింటు సాఫ్ట్‌వేర్ మీద తయారు చేస్తున్నాను.

అప్పుడే గణగణ మోగింది ఫోన్.

"ఏయ్ డానీ-బాగున్నావా? ఎప్పుడు వచ్చావ్ ఇండియా నించి"

"నిన్న మధ్యాహ్నం"

"మరి పూర్తిగా నిద్రమత్తు వదిలిందా - అప్పుడే ఆఫీస్‌కి వచ్చేశావ్!"

నవ్వాడు డానీ.

"నిద్రా-ఇంకా రెండు రోజులు పడుతుంది. ఈ జెట్‌లాగ్ పోవటానికి. సెలవలు అయిపోయాయికదా - అందుకని ఆఫీస్‌కి వచ్చాను"

"భారతదేశానికి నీ మొదటి ప్రయాణం ఎలా వుంది?" అడిగాడు కుతూహలంగా.

"ఓ - చాలా బాగుంది. దిస్ వన్ ఈజ్ ది ట్రిప్ ఆఫ్ మై లైఫ్ - నీతో చాలా మాట్లాడాలి. ఇవాళ నీ లంచ్ ప్లాన్స్ ఏమిటి?" అడిగాడు డానీ.

అతని గొంతులో మంచి ఉత్సాహం.

"ఇంతవరకూ ఏమీ లేదు - 'పసంద్'కి వెడదామా?"

"ష్యూర్ - ఐ లవ్ ఇట్. పదకొండున్నరకు అక్కడకు వస్తాను - నువ్వూ వస్తావా?"

"నువ్వు రమ్మంటే తప్పకుండా వస్తాను" అని ఫోన్ పెట్టేశాను.

డానీ చాలా విచిత్రమైన మనిషి, అతను కాలిఫోర్నియాలో పుట్టి పెరిగాడు. ముప్పయి అయిదేళ్ళ వయసు వుంటుందేమో. పెళ్లీ పెటాకులు చేసుకోలేదు. ఒంటరి జీవితం. అయినా ఒక క్షణం కూడా వృథా చేయని జీవితం. మిగతా దేశాల గురించి చాలా చదివాడు. అర్జంటీనా, బ్రెజిల్, నైజీరియా లాంటి దేశాలు చూసి వచ్చాడు కూడాను.

చూడటం అంటే సరదాగా చూసి రావటం కాదు. ముందు ఆ దేశం గురించి, వారి సంస్కృతి, మతం, భాష గురించి క్షుణ్ణంగా చదువుతాడు. కాలిఫోర్నియాలోని సిలికాన్ వాలీలో, విదేశీయులకు కొరత లేదు. ప్రపంచంలోని హైటెక్నాలజీకి రాజధాని. ఆయా దేశాలవారిని కలిసి, అన్నీ తెలుసుకుంటాడు.

తర్వాత ఆ దేశాలు చూసి వచ్చి, మాగజైన్స్‌లోనూ, పేపర్లలోనూ, ఇంటర్‌నెట్‌లోనూ, 'ట్రావెలాగ్'లు రాస్తాడు. ఈమధ్యనే అవన్నీ కలిపి, ఒక పుస్తకంలాగా కూడా వేద్దామనుకుంటున్నానని చెప్పాడు.

అతను పనిచేసే ఉద్యోగం, ఒక నెట్‌వర్కింగ్ కంపెనీలో. ప్రోగ్రామర్‌గా బాగానే సంపాదిస్తాడు కానీ, ఈ ప్రయాణాలకు అది చాలదు. అందుకని, కొన్ని సాయంత్రాలు, వారాంతాలు మిగతా ఏవేవో పనులు చేసి డబ్బులు సంపాదిస్తాడు. నాకు అతను పరిచయం అయింది కూడా ఆ రకంగానే.

ఒక సంవత్సరం క్రితం అనుకుంటాను. 'ఎల్‌కామినో రియాల్' రోడ్డులో, ఏదో ఆలోచిస్తూ కారు డ్రైవ్ చేస్తూ, ఎర్రలైటు చూసుకోకుండా, ఆగకుండా ముందుకు వెళ్ళాను. నా వెనకనే వున్నాడు పోలీసాసురుడు. వెంటనే ఎర్ర, నీలం రంగు లైట్లు వెలిగించి, సైరన్ మోగించి, పక్కకు వచ్చి కారు ఆపమన్నాడు.

"సారీ - ఆఫీసర్" అన్నాను - చేతిలో పాడ్‌తో కారు కిటికీ దగ్గర నుంచున్న పోలీసుని చూసి.

అతను నవ్వాడు - "మిమ్మల్ని ఎందుకు ఆపానో తెలుసుకదా!" అన్నాడు.

"ఈమధ్య ఆఫీసులో స్ట్రెస్ ఎక్కువయింది - అందుకని పరధ్యానంగా వుండి ఎర్ర లైటుని

చూడలేదు. ఐయామ్ సారీ" అన్నాను.

పోలీస్, నా డ్రైవర్ లైసెన్స్, ఇన్స్యూరెన్సు తీసుకుని, టిక్కెట్టు రాసి, అన్నీ చేతికి ఇచ్చాడు - "డ్రైవ్ కేర్‌ఫుల్లీ!" అని వెళ్ళిపోయాడు.

అదే నాకు వచ్చిన మొదటి ట్రాఫిక్ టికెట్. ఆ టికెట్టు, నా డ్రైవింగ్ రిపోర్టులోనించి తీసివేయటం కోసం, తర్వాత శనివారం 'డిఫెన్సివ్ డ్రైవింగ్ కోర్స్' తీసుకుందామని వెళ్ళాను.

ఆ క్లాసు పొద్దున తొమ్మిది గంటల నించీ, సాయంత్రం నాలుగు దాకా. ఆ క్లాసులో, డ్రైవింగ్ చేసేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు తెలుసుకుంటే, ఈ ట్రాఫిక్ టికెట్టు, ఇక నా డ్రైవింగ్ రికార్డులో కనపడదు. కారు ఇన్సూరెన్స్ ప్రీమియమ్ కూడా పది శాతం తగ్గుతుంది.

అందుకే ఆ క్లాసుకి వెళ్లాను.

అప్పుడే పరిచయం అయ్యాడు డానీ రాబిన్‌సన్. ఆ క్లాస్‌కి అతనే ఇన్‌స్ట్రక్టర్. మొదటి పరిచయంలోనే నన్ను బాగా ఆకట్టుకున్నాడు. మంచి స్నేహితుడయిపోయాడు. తరువాత 'ఇండియన్' రెస్టారెంటులో రెండు మూడు సార్లు ఇద్దరం కలిసి భోజనం చేశాం.

అతను ఇండియా గురించి, హిందూమతం గురించి, భారతీయ సంస్కృతి, భాషల గురించి చాలా ప్రశ్నలు అడుగుతూ వుండేవాడు. అంతేకాదు అతను మన దేశం గురించి, నాకు తెలియని కొన్ని విషయాలు కూడా అప్పుడప్పుడూ చెబుతూ వుంటే, ఆశ్చర్యపోయాను. అతను ఎన్నో పుస్తకాలు చదివాడు. చాలా అనర్గళంగా మాట్లాడతాడు.

సరిగ్గా పదకొండున్నరకు, 'పసంద్' రెస్టారెంటుకి వెళ్ళాను.

మేనేజర్ రెడ్డిగారు నవ్వుతూ పలకరించి, "ఒక్కరేనా"? అన్నారు.

"కాదు - ఇద్దరం" అని ఆయన చూపించిన టేబుల్ దగ్గర కూర్చున్నాను.

రెండు నిమిషాల తర్వాత, ముఖమంతా చిరునవ్వుతో వచ్చాడు డానీ. ఆరడుగుల నాలుగంగుళాల ఎత్తు, తెల్లటి శరీరచ్ఛాయ, రాగిరంగు జుట్టు.

"వెల్‌కం బాక్ ఫ్రం ఇండియా!" అన్నాను చేయి ముందుకు చాపుతూ.

"నీతో చాలా చెప్పాలి - ఐ హేడ్ ఎ వండర్‌ఫుల్ టైమ్!" అన్నాడు డానీ, నా చేయి నొక్కుతూ.

బేరర్‌కి ఫుడ్ ఆర్డర్ చేసిన తర్వాత అడిగాను -"ఇప్పుడు చెప్పు - అక్కడ ఏమేం చూశావ్?"

డానీ క్షణం కళ్ళు మూసుకున్నాడు.

ఎక్కడ ప్రారంభించాలా అని ఆలోచిస్తున్నాడని నాకు తెలుసు.

ఐస్ టీ త్రాగుతూ, నేనూ మౌనంగా అతన్నే చూస్తూ వున్నాను.

"నేను బాంబేలో దిగానా....." అంటూ మొదలు పెట్టాడు డానీ.

"అక్కడినించే నా యాత్రలోని మధురఘట్టాలు మొదలయ్యాయి. కొంచెం వయసు మీరిన దంపతులు చిరునవ్వుతో పలకరించారు.

"ఆవిడయితే మరీనూ. 'ఇక్కడ, ఎక్కడ ఏమున్నాయో తెలుసుకోవటం కష్టం. మీరు మాతో రండి. ఇమ్మిగ్రేషన్, కష్టమ్సూ ఎక్కడున్నాయో, ఇక్కడి పద్ధతులు ఎలా వుంటాయో, అన్నీ మీకు తేలికగా వుంటుంది' అని చిరునవ్వుతో చెప్పింది.

వాళ్ళ సహాయంతో ఎయిర్‌పోర్ట్‌లో నా పనులన్నీ సక్రమంగా జరిగిపోయాయి. మీ దేశీయులు ఆతిథ్యంలో ఎంత గొప్పవాళ్లో చదివాను కానీ అప్పుడే ప్రత్యక్షంగా చూడటం!"

డానీకీ, చాలామంది మిగతా ప్రయాణీకులకీ వున్న తేడా వెంటనే కనిపెట్టేశాను.

మనవాళ్ళే చాలామంది ముందుగా చూసేది, అక్కడవున్న 'నెగెటివ్' విషయాలని. మా రామనాథం అయితే, 'ఏమిటి ఆ ఎయిర్‌పోర్టులో ఏ బోర్డులూ వుండవు - ఎటుపోవాలో తెలీదు - హిందీలో తప్ప మాట్లాడి చావరు - ఎయిర్ పోర్టంతా ఒకటే వాసన - బొద్దింకలు.....' అంటూ మొదలు పెట్టేవాడు.

డానీ గాజుగ్లాసులోని మంచినీళ్ళు సగం తాగి, గ్లాసు టేబుల్ మీద పెట్టాడు.

ఆ గాజు గ్లాసులో సగం నీళ్ళు చూసి, సగం నిండుగా వుందనే వాళ్ళు వున్నారు - సగం ఖాళీగా వుందనే వాళ్ళు కూడా వున్నారు.

గ్లాసులో నీళ్ళు అన్నే వున్నా, మనుషుల ఆలోచనలు, వారి మనస్థత్వాలు అలా మాట్లాడిస్తాయి.

డానీ, తరువాత ముప్ఫయి అయిదు నిముషాలు ఆపకుండా ఏకధాటిగా మాట్లాడుతూనే వున్నాడు.

అతను తాజ్‌మహల్, బిర్లా మందిరం లాంటి కట్టడాలను చూశాడు.

బాంబే, మద్రాస్ లాంటి మహానగరాలను చూశాడు. పల్లెటూర్లను చూశాడు. జయపూర్ లోని ప్యాలస్‌ని చూడటమే కాకుండా, రాజవిలాసాలమీద చాలా నోట్స్ రాసుకున్నాడు. రిక్షా వాళ్ళతో పాటు టీ కొట్టులో కూర్చుని, వాళ్ళ జీవితాలను పరిశీలించాడు. కలకత్తా లోని మదర్ థెరీసా ఆశ్రమంలో జరుగుతున్న అనాథ మానవసేవ చూశాడు.

యలమంచిలి వెళ్లి, భాగవతుల ఛారిటబుల్ ట్రస్ట్ సూత్రధారుడు పరమేశ్వర్రావ్ గారు, అమెరికాలోని అన్ని భోగాలను విడిచి పెట్టి, నిస్వార్థంగా చేస్తున్న మానవతా యజ్ఞం, తన్మయత్వంతో చూశాడు.

జుమ్మా మసీదులోని ప్రార్థనలను, తిరుపతిలోని పూజలను చూశాడు. ఎన్నో భాషల పుస్తకాలు తీసుకుపోయినా, అందరూ ఇంగ్లీషులోనూ, సంజ్ఞలతోనూ, తనతో మాట్లాడి సహాయపడిన పద్ధతి గురించి చెబుతూ, పడీపడీ నవ్వాడు.

"ఇక్కడ అమెరికాలో, ఇండియా గురించి టీ.వీ. లోనూ, పేపర్లలోనూ ఎంతో ఛండాలంగా చూపిస్తారు. రాస్తారు. అదే నాకు అర్థం కాదు. ప్రొద్దుటి నించీ సాయంత్రం దాకా శరీర కష్టం చేసిన మనుష్యులు - ఏ చెట్టు కిందో, గుడిసెలోనో చేరి, వంట వండుకుని, తిని, ఒళ్లు మరచి నిద్రపోవటం చూశాను.

"ఆ వాస్తవ ప్రపంచపు శ్రమజీవన వాడిలో, కొన్ని గంటలసేపు సుఖనిద్ర.

"ఆ నిద్రలో వారి అలసిన ముఖాలపై లాస్యం చేస్తున్న మమతానురాగాలు. వాళ్ళ జీవన స్థాయి ఇంకా పెరిగితే, వాళ్ళతో పాటు నేనూ సంతోషిస్తాను.

"కానీ ఆ వున్నదాంట్లోనే తృప్తి, ఆనందం నన్ను కదిలించాయి"

డానీ ఒక్క క్షణం ఆగాడు.

డానీ ఎప్పుడూ నోటితో మాట్లాడతాడని మాత్రం తెలుసు నాకు - కానీ మొదటిసారి చూస్తున్నాను, అతను హృదయంతో, హృదయపు లోతుల్లోనించి మాట్లాడుతున్నాడు.

"నువ్వొకసారి - ఒక తెలుగు పాటకు అర్థం చెప్పావు నాకు. దానిని నేను ఎప్పుడూ మరిచిపోలేదు. అది - చీకటిని కప్పుకుని వెలుతురి ఒడిలో పడుకున్న మనుషులం మనం. చీకటిలో వున్నవాళ్ళను, చీకటి ఎప్పుడూ వుండదనీ, వెలుతురు రాబోతున్నదనే ఆశ ముందుకి నడిపిస్తుంది.

"వెలుతురు కూడా జీవితంలో ఎక్కువసేపు వుండదనీ, చీకటి బారినుంచి తప్పించుకోలేమన్న భావం మనిషిలో ధైర్యాన్ని, ఏ కష్టాన్నయినా ఎదుర్కొనే ఆత్మ స్థైర్యాన్నిస్తుందనీ - ఆ చీకటి, వెలుతురుల - రాత్రీ పగళ్ల - సామరస్యాన్ని అర్థం చేసుకున్న మనిషి సిద్ధయోగి అనీ. నాకు చాలామంది మహాయోగుల్లా కనపడ్డారు అక్కడ" మళ్ళీ ఆగాడు డానీ.

అతని మాటలకు నేను చలించిపోయాను.

అతని చేయి సుతారంగా నొక్కి, "థాంక్స్ డానీ - నీ అభిప్రాయం నీకే కాదు - ప్రతి భారతీయుడికీ ఒక సర్టిఫికెట్" అన్నాను.

నాకు తెలుసు అతను, గాజుగ్లాసులో నిండుగా వున్న సగం గురించే మాట్లాడుతున్నాడని - అతను అంత డబ్బు ఖర్చు పెట్టుకుని, ఇండియా వెళ్ళిందే ఆ సగం చూడటానికి, అతనికి ఖాళీగా వున్న గాజుగ్లాసులోని రెండో సగంతో పనిలేదు. అందుకే ఇంకా చెబుతున్నాడు.

మద్రాస్‌లో రామకృష్ణ ఆశ్రమంలో జీవితానికి సంబంధించి చక్కని నిర్వచనం తెలుసుకున్నానన్నాడు.

కేరళ సముద్రపు అందాలను వర్ణించాడు. పాండీలోని అరవిందుని ఆశ్రమంలోనూ, కన్యాకుమారిలో వివేకానందుని స్మారక చిహ్నం దగ్గర తన మనసు మనశ్శాంతితో ఎంత తేలిక అయిపోయిందో చెప్పాడు.

తను ఖర్చుపెట్టిన ప్రతి డాలరూ ఎంత తృప్తినిచ్చిందో చెప్పాడు.

"కానీ - ఒక విషయంలో మాత్రం నేను మీ వాళ్ళ ఆలోచనలను, భావాలనూ, అనుసరిస్తున్నటువంటి పద్ధతులనూ ఏ మాత్రం క్షమించలేను. చాలా ఘోరమైన ప్రమాదావస్థలో వున్నది భారత దేశం" అన్నాడు తినటం పూర్తిచేసి.

బల్లమీద, సగం ఖాళీగా వున్న గ్లాసులోని పై భాగం వంక చూస్తున్నాను.

నిండుగా వున్న సగాన్ని హృదయాంతరాళాల్లోంచి వెలికితీసిన డానీ, ఇప్పుడు...... ఏమని సమాధానం చెబుతాడా అని, నండూరివారు అన్నట్టుగా, నా గుండె గొంతుకలో కొట్టాడసాగింది.

"ఎక్కడ చూసినా ఒకటే భావం కనిపిస్తుంది. నువ్వు దక్షిణ భారతదేశం వాడివీ, నేను ఉత్తర భారత దేశంవాడిని, నువ్వు మద్రాసీవి, నేను ఢిల్లీవాలాని. నువ్వు బెంగాలీవి, నేను గుజరాతీని. నువ్వు ఆంధ్రావాడివి, నేను తెలంగాణావాడిని.

"నువ్వు హిందూవి, నేను ముస్లిమ్‌ని. నువ్వు రెడ్డివి, నేను చౌదరిని - నేను భారతీయుడనని చెప్పుకునేవాడు, నాకు ఒక్కడు కనపడలేదు.

"ఏమవుతున్నది భారతదేశంలో, ఎందుకా విచ్ఛిన్నత. ఎందుకా గీతలు గీసుకోవటం. దానివల్ల నష్టమే కానీ, ఎవరికీ ఏ మాత్రం లాభం లేదు.

"డివైడ్ అండ్ రూల్ అన్న బ్రిటీష్‌వాళ్ళు. దేశం వదిలివెళ్ళి యాభై సంవత్సరాలయింది. వాళ్ళని తప్పు పట్టటానికి లేదు. నేను ఇలా అంటున్నానని నన్ను తప్పు పట్టకు. నీకు బాధ కలిగిస్తే, నన్ను మన్నించు.

"అక్కడి మనుష్యుల్లో జాతీయతాభావం అసలు లేదని నేను అనటం లేదు. చాల, చాల తక్కువగా కనపడుతున్నది అంటున్నాను. మీ దేశంలోని ఔన్నత్యం నన్ను పాజిటివ్‌గా

ఎంత కదిలించిందో, ఈ విషయం నన్నంతగా కలవరపరిచింది. అందుకని నన్ను అర్థం చేసుకుంటావన్న ధైర్యంతో చెబుతున్నాను!" డానీ చెప్పటం ఆపి ఆలోచనలో పడ్డాడు.

నాకూ హఠాత్తుగా జపాన్‌లో జరిగిన సంఘటన గుర్తుకు వచ్చింది. రెండేళ్ళ క్రితం ఆఫీస్ పనిమీద జపాన్ వెళ్ళాను. సెమీ కండక్టర్ చిప్స్ తయారుచేసే మెషీన్లలో వాడే రోబాట్‌లు కొనటానికి.

అక్కడ చాలా ప్రముఖమైన ఆ కంపెనీవాళ్ళు, మేము ఇచ్చిన డిజైన్ ప్రకారం రోబాట్‌లను తయారు చేస్తున్నారు. ఆ కంపెనీలో 'క్వాలిటీ సర్వే' చేయటానికి వెళ్లాను నేను. అక్కడ పనిచేసే ప్రతి మనిషీ, ఎంతో పనితనంతో, చక్కని నైపుణ్యంతో తయారు చేస్తున్నారు ప్రతి భాగాన్నీ.

ఎవరిని కదిపినా ఒకటే మాట. నాణ్యత, నాణ్యత, నాణ్యత. దానికి కారణం నన్ను ఆశ్చర్యపరిచింది. 'మా దేశంలో తయారయ్యే యంత్రాలు పనిచేయకపోతే మాకూ, మా దేశానికీ సిగ్గుచేటు - అది జరగటానికి వీలులేదు. అందుకే ఎంతో జాగ్రత్తగా పనిచేస్తున్నాం' అని గర్వంగా చెప్పారు.

అంతేకాదు, ఆ దేశీయ భావం, దేశాభిమానం, ఆ స్వదేశ గౌరవం, జపాన్‌ని ఇరవై అయిదేళ్ళలో (రెండవ ప్రపంచ యుద్ధంలో ఆటంబాంబులతో నేలమట్టం అయిన తరువాత) ప్రపంచంలో కెల్లా సాంకేతికపరంగా, పారిశ్రామికంగా మొదటి స్థానంలో నిలబెట్టింది.

నేను అక్కడ వున్న ప్రతిరోజూ, ఆ జాతీయ భావం వాళ్ళ కళ్ళల్లో, చేతల్లో చూస్తూనే వున్నాను.

నా ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ అన్నాడు డానీ -

"భారత దేశం కన్నా కూడా అమెరికాలో భిన్నత్వం ఎక్కువ. ఎన్నో దేశాలవాళ్ళూ, ఎన్నో భాషల వాళ్ళూ, మతాల వాళ్ళూ, సంస్కృతులకు చెందినవాళ్ళూ ఇక్కడకు వచ్చి అమెరికన్ పౌరసత్వం తీసుకుంటున్నారు. అక్కడా, ఇక్కడా చిన్న చిన్న మనస్పర్థలు రావటం తప్ప, అంతా ఒక్క త్రాటి మీద నడుస్తున్నారు.

"నేను చైనీస్ అమెరికన్ని, ఆఫ్రికన్ అమెరికన్ని, మెక్సికన్ అమెరికన్ని, ఇండియన్ అమెరికన్‌ని అని ఎంతో గర్వంగా చెప్పుకుంటున్నారు.

"ఒకే కంపెనీలో పనిచేసి, ఉత్పత్తిని పెంచి, దేశాభ్యుదయాన్ని విశ్వవ్యాప్తం చేస్తున్నారు. అమెరికా తరఫున ఆటలు ఆడుతున్నారు. ఒలెంపిక్స్‌లో అమెరికన్ జెండా ఎగురుతున్నప్పుడు, మెడలో మెడల్స్ వేలాడుతుంటే, వాళ్ళ కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి.

"అలాంటిది, ఇండియాలో పుట్టి, ఇండియాలో పెరిగి - 'నా దేశం ఇది. నేను ఇండియన్ని' - అని ఎందుకు అనలేకపోతున్నారు?

"ఈ విషయంలో నేను చాలా కలవరపడుతున్నాను. దేశ భవిష్యత్తు దృష్ట్యా, సమైక్యత దృష్ట్యా అది చాలా ప్రమాదకరమైన విషయం!" అన్నాడు డానీ, నా వైపు సూటిగా చూస్తూ.

నేను సిగ్గుతో తల వంచుకున్నాను.

ఒక ప్రాంతీయుడిగా, ఒక భాషావాదిగా, ఒక కులానికి చెందినవాడిగా, ఒక మతానికి చెందినవాడిగా. కానీ భారతీయుడిగా మాత్రం కాదు. ★

*(స్వాతి సపరివార పత్రిక: ఏప్రిల్ 18, 1997)*

*(ఈ కథ విధానం కల్పనకానీ, కథాంశం మాత్రం నిజంగా అమెరికాలో జరిగిందే. రచయిత)*